క్లుప్తంగా

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ



చినపాచిలలో ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు, ధార్మిక సంఘాల సభ్యులు

రావికమతం: అయోధ్య రాముని అక్షింతల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చినపాచిలలో నిర్వహించారు. గ్రామంలో వైష్ణవీ మాత ఆలయం నుంచి భారీ ర్యాలీగా ప్రధాన వీధుల్లో తిరిగారు. వెండి, రాగి కలశాలతో అక్షింతలను ఊరేగించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం 500 మంది సభ్యులు, భజన మండలి ప్రతినిధులు గ్రూపులుగా విడిపోయి ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. గ్రామ నాయకులు, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

పక్కాగా అభివృద్ధి ప్రణాళికలు



మాట్లాడుతున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి: గ్రామ పంచాయతీలను మరింత అభివృద్ధి చేసే దిశగా పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో అభివృద్ధి ప్రణాళిల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీ, బ్లాక్ స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీకి అవసరమైన సలహాలు, సూచనలు స్వీకరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి జి.వి.రమణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, దేవరాపల్లి సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాలకు వేలం

మాడుగుల: సారాతో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలకు స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌లో ఆదివారం ఉదయం 9.30 గంటలకు వేలం వేయనున్నామని సీఐ సింహాద్రి తెలిపారు. ఆసక్తి గలవారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. అధిక మొత్తానికి వేలం పాడినవారు 18 శాతం జీఎస్టీ చెల్లించాలని తెలిపారు.

కబడ్డీ విజేత ధర్మసాగరం



విజేత జట్టుతో సర్పంచ్ కన్నయ్యనాయుడు, ఎంపీడీవో జయమాధవి

నర్సీపట్నం: ఆడుదాం-ఆంధ్రా మండల స్థాయి కబడ్డీ పోటీల్లో ధర్మసాగరం జట్టు విజేతగా నిలిచింది. నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఫైనల్లో బయపురెడ్డిపాలెం జట్టుతో తలపడగా, హోరా హోరీగా సాగిన ఈ పోటీల్లో ధర్మసాగరం విజయకేతనం ఎగురవేసింది. సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు, ఎంపీడీవో జయమాధవి క్రీడాకారులను అభినందించారు. నియోజకవర్గ, జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

చోడవరం: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించే జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం చేశామని హెచ్ఎం రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. 2024 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరేందుకు ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు ఈ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు విధిగా 11 గంటలకల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా సెంటర్‌లోకి అనుమతించబోమన్నారు. హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డును తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నేడు గడపగడపకు

చీడికాడ: అప్పలరాజుపురంలో శనివారం ఉదయం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. ఉదయం 8 గంటలకు చేపట్టే ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరై పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారన్నారు. పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నేతలు హాజరు కావాలని కోరారు.

యూటీఎఫ్ నిరసన

నర్సీపట్నం: ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు చిట్టియ్య, గడ్డినాయుడు, సత్యనారాయణ, ప్రసాద్ మాట్లాడుతూ పీఎఫ్, పెండింగ్ డీఏ, ఏరియర్స్, పీఆర్సీ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

గ్రామ తీర్థాల కోలాహలం

సంక్రాంతి పండగ ముగిసింది.. ఇప్పుడు గ్రామాల్లో తీర్థాల సందడి నెలకొంది. జిల్లాలో ఎక్కడ చూసినా విద్యుత్తు దీపాల అలంకరణలో అమ్మవార్ల ఆలయాలు దర్శనమిస్తున్నాయి. భక్తులతో వాటి ప్రాంగణాలు.. ఆట విడుపు కోసం ప్రత్యేక ఏర్పాట్లు కనిపిస్తున్నాయి.

- నందడిగా మారిన పల్లెలు..
- ముషిడిపల్లిలో హోరా హోరీగా జిల్లా స్థాయి గుర్రపు పోటీలు

దేవరాపల్లి: ముషిడిపల్లిలో దుర్గమాంబ తీర్థాన్ని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి గుర్రపు పరుగు ప్రదర్శన రసవత్తరంగా జరిగింది. స్థానిక సర్పంచ్ మతల దేముడమ్మ, ఎంపీటీసీ బొడ్డు లక్ష్మిల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 12 గుర్రాలు పాల్గొన్నాయి. ఈ పోటీలను విజయనగరం డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరాము నాయుడు, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన విభాగం అధ్యక్షుడు కర్రి సూరినాయుడు ప్రారంభించారు. అనంతరం విజేతలకు వరుసగా రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున బహుమతులను ప్రదానం చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మతల మధు సూదన్, బొడ్డు అప్పారావు, బొడ్డు నారాయణమూర్తి, గొంప ముత్యాలనాయుడు, మతల గోవింద, మతల వెంకునాయుడు, చీపురుపల్లి శ్రీరామమూర్తి, పోతల సత్యం, కొల్లి వెంకటరావు పాల్గొన్నారు.

శరభవరంలో ముగ్గుల పోటీలు

రోలుగుంట: శరభవరంలో గురువారం కాపువీధి, శుక్రవారం వెలమవీధిలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వీధుల్లో ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాపువీధిలో వేసిన ముగ్గులను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు దోసపత్ని రాజు, పంచాడ చినరాయుడు పరిశీలించారు. ప్రథమ, ద్వితీయ బహుమతులను వైస్ ఎంపీపీ వరలక్ష్మి ఆర్థిక సాయంతో ప్రదానం చేశారు.



కె.జె.పురంలో సీతారాముల తీర్థానికి తరలి వచ్చిన భక్తులు

కె.జె.పురంలో సీతారాముల తీర్థం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో సీతారాములోరి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయం ఎదుట తోడపెద్దు సేవ నిర్వహించారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

కె.కోటపాడు: సూర్రెడ్డిపాలెంలో దుర్గాలమ్మ, కె.సంతపాలెంలో నాగదుర్గాలమ్మ తీర్థాల సందర్భంగా ఆయా ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచే పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

గొలుగొండ: కొత్తపాలెంలో ఘనంగా తీర్థం నిర్వహించారు. ఇక్కడకు గొలుగొండ, అచ్చియ్యపేట, చిన్నయ్యపాలెం, కొత్తమల్లంపేట తదితర గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. రామాలయం వద్ద రామకీర్తనలతో గ్రామం మారుమోగింది. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



కె.జె.పురంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



రోలుగుంట: ముగ్గులను పరిశీలిస్తున్న యువజన శాఖ మండలాధ్యక్షుడు దోసపత్ని రాజు



ముషిడిపల్లిలో గుర్రపు పోటీలను తిలకిస్తున్న విజయనగరం డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

సీఎం సమావేశానికి తరలివెళ్దాం

ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: భీమిలిలో ఈ నెల 25న జరిగే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమావేశానికి తరలి వెళ్దామని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సూచించారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని నియోజకవర్గాల పార్టీ నాయకులతో సమావేశం కావాలని సీఎం నిర్ణయం తీసుకున్నారన్నారు. 7,500 మంది కేడర్‌తో సమావేశానికి వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా సీఎం సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు పని చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

కులగణన సర్వే ప్రారంభం

రావికమతం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే మండలంలోని 28 పంచాయతీల పరిధిలో శుక్రవారం ప్రారంభమైంది. ఆయా గ్రామాల వలంటీర్లు ఈ ప్రక్రియను ఇంటింటికీ తిరిగి చేపడుతున్నారు. రెండు సెక్షన్లలో 23 పాయింట్లను కుటుంబ పెద్ద నుంచి సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు.

మాడుగుల రూరల్: బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక, రాజకీయ, సాధికారత కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలతో కుల గణన సర్వే గ్రామాల్లో శుక్రవారం ప్రారంభమైంది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోల సారథ్యంలో ఈ సర్వే ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నిర్వహించేందుకుగాను 723 కులాల జాబితాను ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీల వారీగా వర్గీకరించి మొబైల్ యాప్‌లో అనుసంధానించారు

గొలుగొండ: మండలంలో కుల గణన సర్వే ప్రారంభమైందని తహసీల్దార్ ఆనందరావు శుక్రవారం తెలిపారు. 27 గ్రామ పంచాయతీల్లో 60 వేలకు పైగా జనాభా ఉందన్నారు. ప్రత్యేక అధికారుల బృందం ప్రతీ ఇంటికి వెళ్లి కులాల వారీగా వివరాలు సేకరిస్తారని, ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.



కొత్తకోటలో కులగణన చేస్తున్న వలంటీర్లు

ఎలక్ట్రికల్ యూనియన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

చోడవరం: స్థానిక క్యాంపు కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) డైరీ, క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని యూనియన్ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, రీజనల్ అధ్యక్షుడు ప్రేమ చంద్రశేఖర్, డివిజన్ అధ్యక్షుడు కే నాగఅప్పారావు, యూనియన్ ప్రతినిధులు జీపీ సత్యనారాయణ, బీ కొండలరావు, బీ రవిప్రసాద్, బీబీ నాయుడు, కే గోపీ, కే సుబ్బారావు పాల్గొన్నారు.



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

206 అడుగుల కాంస్య విగ్రహం చరిత్రాత్మక నిర్ణయం

నర్సీపట్నం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జాతి నాయకుడు కాదని జాతీయ నాయకుడని తహసీల్దార్ అన్నాజీరావు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో సామాజిక సమతా సంకల్ప మహోత్సవం ముగింపు సభ జరిగింది. ముందుగా అంబేడ్కర్ భారీ చిత్రపటానికి తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయ ఏవో సూర్యనారాయణ, డివిజనల్ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ మెంబరు ఎం.అప్పలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలు, మైనారిటీలు, అన్ని వర్గాల్లో అణగారిన ప్రజలకు రక్షణ కల్పించే విధంగా రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అని కొనియాడారు. అమరావతిలో 206 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు, దళిత సేవా పరిరక్షణ నాయకులు యాదగిరి దాసు, ఎల్లాజీ, హౌసింగ్ ఏఈ నాయుడు, వసతి గృహం సంక్షేమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అడిదెల బాబూరావు, ఉపాధ్యాయులు మారయ్య, మర్రా సత్తిబాబు, రేబాక ఇంద్రకుమార్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్ అన్నాజీరావు

ప్రతి కుటుంబానికి 100 రోజుల పని దినాలు



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

కె.కోటపాడు: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డుదారులకు ఏడాదికి వంద రోజుల పని దినాలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం కె.కోటపాడులో గ్రామీణ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు పథకం, ఉపాధి హామీ, హౌసింగ్, వ్యవసాయ శాఖ, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న పథకాలపై అధికారులు వివరించారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా మండలంలో ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిని ఏర్పాటు చేస్తున్నట్లు జేఈ అల్లు శ్వేత తెలిపారు. గర్భిణులు, బాలింతల మెరుగైన ఆరోగ్యం కోసం పౌష్టికాహారం అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్ హౌసింగ్ ఏఈ నాయుడు, వ్యవసాయాధికారి సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభను విజయవంతం చేద్దాం

దేవరాపల్లి: భీమిలిలో ఈ నెల 25న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు కోరారు. శుక్రవారం దేవరాపల్లిలో వారు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా సీఎం జగన్ కేడర్‌కు దిశానిర్దేశం చేస్తారన్నారు. ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తారన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు హాజరు కావాలని కోరారు.



మాట్లాడుతున్న నాయకులు కర్రి సత్యం, కిలపర్తి భాస్కరరావు, బూరె బాబురావు

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



వడ్డాది కాటా వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు



రావికమతం చెరకు కాటా వద్ద..

బుచ్చెయ్యపేట/రావికమతం: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ విజ్ఞప్తి మేరకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.12.50 కోట్లు మంజూరు చేసి ఆదుకోవడంపై రైతు సంఘ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం బుచ్చెయ్యపేట, వడ్డాది, రావికమతం చెరకు కాటాల వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విప్ ధర్మశ్రీ చిత్రపటాలకు జెడ్పీటీసీ దొండా రాంబాబు, మండలాధ్యక్షులు జోగా కొండబాబు, ముక్కా మహలక్ష్మి నాయుడు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు క్షీరాభిషేకాలు చేశారు. రైతు బాంధవుడిగా సీఎం వైఎస్ జగన్ నిరూపించుకున్నారని, నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ధర్మశ్రీకి రుణపడి ఉంటామని రైతులు తెలిపారు. రైతు సంఘ నాయకులు సుంకరి గాంధీ, పెదిరెడ్ల మాణిక్యం, తమరాన రమణ, బొబ్బరి ఈశ్వరరావు, నాళం శ్రీరామూర్తి, ఈశ్వరరావు, వరహాలు, కొండయ్య, సభ్య రైతులు కొసిరెడ్డి ప్రసాద్, గొర్లె రవికుమార్, దాసరి వరహాలు, మూర్తినాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

సర్పంచ్ తల్లి మృతికి సంతాపం

రావికమతం: కొత్తకోట మేజర్ పంచాయతీ సర్పంచ్ కోన లోవరాజు మాతృమూర్తి నూకాలమ్మ(80) శుక్రవారం మృతి చెందారు. రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రికెట్ పోటీలు ప్రారంభం

చీడికాడ: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం అప్పలరాజుపురం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రికెట్ పోటీలను ఎంపీపీ కురచా జయమ్మ ప్రారంభించారు. టాస్ వేసి పోటీలను ఆమె ప్రారంభించగా, బ్యాటింగ్ చేసి ఎంపీడీవో జయప్రకాష్ అలరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన

నాతవరం: ఈవీఎం ఓటింగ్‌పై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. శుక్రవారం శృంగవరం, నాయుడుపాలెం, ముగలపూడి గ్రామాల్లో ఈవీఎంలో ఓటు వేసే విధానంపై ఓటర్లకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో 65 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసేందుకు ప్రత్యేకంగా సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఓటరు జాబితాలో తప్పొప్పులను సరి చేసే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, జూనియర్ అసిస్టెంటు హరి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యుడు ఉలబాల శ్రీను, బీసీ సెల్ మండలాధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.



శృంగవరంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

గ్రామ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు

డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్



మాడుగుల రూరల్: ఎం. కోటపాడులో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు



చీడికాడ: ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న ఎంపీపీ జయమ్మ



చోడవరం: పీఎస్‌పేటలో శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి చరణ్



కొవ్వూరులో రోగులకు కేస్ సీట్ అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి



గొలుగొండ: రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

చోడవరం: పీఎస్‌పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ఆధ్వర్యంలో ఐదుగురు వైద్యుల బృందం 386 మందికి వైద్య సేవలందించింది. ఈ శిబిరాన్ని డీఎంహెచ్‌వో ఎ.హేమంత్‌కుమార్ సందర్శించారు. రోగులకు ఓపీ మాదిరిగా చీటీలు ఇచ్చి వైద్య సేవలు మరింతగా అందించాలన్నారు.

రోలుగుంట: గ్రామ స్థాయిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ఉద్దేశమని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి అన్నారు. శుక్రవారం కొవ్వూరులో 353 మంది రోగులకు జనరల్ సర్జన్స్ కె.ధనలక్ష్మి, వి.శ్యామ్‌కృష్ణ, గైనకాలజిస్ట్ జి.అనూష, ఆప్తాలమిక్ అసిస్టెంట్ కరుణకుమారి పరీక్షించారు. ఎంపీడీవో విజయకుమారి, సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మతో కలసి రోగులకు ఆరోగ్య కేస్ సీట్లు అందజేశారు.

నాతవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష -2 శిబిరాన్ని శుక్రవారం నాతవరంలో ఏర్పాటు చేశారు. శిబిరంలో 50 మందికి కళ్లద్దాలు పంపిణీ చేసారు. ఈ శిబిరంలో 397 మంది రోగులను నాతవరం, గునుపూడి వైద్యాధికారులు ప్రసన్న చంద్రశేఖర్, స్పెషలిస్టు వైద్యులు ఆదిత్య, రాజశేఖర్, లత పరీక్షించారు. ఎంపీడీవో హనుమంతరావు, సర్పంచ్ గొలగాని రాణి, ఎంపీటీసీ సభ్యులు కరక రేణుక, చెక్కా ప్రభావతి, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీను, హైస్కూల్ విద్యా కమిటీ మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ఆరోగ్య సురక్ష శిబిరాలతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని మాడుగుల ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు తెలిపారు. శుక్రవారం ఎం. కోటపాడులో ఆరోగ్య సురక్ష -2 శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్ వి. అశోక్‌కుమార్, గైనకాలజిస్టు డి.ఎం.ఎల్. శృతితోపాటు కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాదు, ఆప్తాల్‌మిక్ అసిస్టెంట్ పి. నాగలక్ష్మి 350 మంది రోగులను పరీక్షించారు. 17 మందికి ఉచితంగా కళ్లద్దాలను ఎంపీడీవో మీనాకుమారి పంపిణీ చేశారు. ఉప సర్పంచ్‌లు శానాపతి గంగాధర్, కరణం రాము, ఎంపీటీసీ సభ్యురాలు కోట్ని సూర్యకుమారి పాల్గొన్నారు.

మాకవరపాలెం: జగనన్న సురక్ష శిబిరంలో 357 మంది రోగులను పరీక్షించారు. మందులు పంపిణీ చేశారు. వీరిలో నలుగురు రోగులకు మెరుగైన చికిత్స అవసరమని గుర్తించారు. కొండలఅగ్రహారంలో శుక్రవారం రెండో విడతగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత పోలిరెడ్డి రమణ, బూరుగుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి చరణ్ పాల్గొన్నారు.

గొలుగొండ: పప్పుశెట్టిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరం నిర్వహించారు. 154 మంది రోగులను వైద్యాధికారి శ్యాంమ్‌కుమార్ పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి పాల్గొన్నారు.

చీడికాడ: అప్పలరాజుపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 శిబిరాన్ని ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు ప్రారంభించారు. చీడికాడ, పెదగోగాడ వైద్య సిబ్బంది, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులను 300 మంది రోగులను పరీక్షించి +మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.